
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 24 జనవరి 2025



కలెక్టర్, ఎస్పీకి ఉత్తమ ఎలక్టోరల్ ఆఫీసర్ అవార్డులు
రేపు విజయవాడలో ప్రదానం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్‌లు ఉత్తమ ఎలక్టోరల్ ఆఫీసర్ అవార్డులకు ఎంపికైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాజాం తహసీల్దార్ కె.కృష్ణంరాజు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వో ఎం.హైమావతి, పోలింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావులు కూడా ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 25 జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో అవార్డులు అందజేయనున్నారు.



రక్తదానం చేస్తున్న అశోక్‌గజపతిరాజు కుమార్తెలు అదితి, విద్యావతీదేవి.. శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి

వేడుకగా లోకేశ్ జన్మదినం

- జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం
- హాజరైన మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి
- 27 మంది దివ్యాంగ పిల్లల దత్తత

విజయనగరం/ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు కార్యక్రమం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భారీగా తరలివచ్చారు. టీడీపీ కార్యాలయం అశోక్ బంగ్లాలో 41 కిలోల కేక్‌ను టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు కట్ చేశారు. కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయనగరంలోని పేర్లవారి వీధిలో వున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు 27 మందిని టీడీపీ నాయకులు దత్తత తీసుకున్నారు. వారికి ఏడాదికి అయ్యే వ్యయాన్ని ఆ పాఠశాల యాజమాన్యానికి అందించారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.6 వేలు చొప్పున రూ.1.68 లక్షల నగదు, స్వీట్లు అందించారు. విజయనగరంలోని అన్న క్యాంటీన్‌లో ఒకరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అయ్యే వ్యయాన్ని కూడా టీడీపీ నేతలు అందజేశారు. విజయనగరం, నెల్లిమర్ల, రాజాం తదితర ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా 952 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే యువ నాయకుడు లోకేశ్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించామన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు అధికంగా పాల్గొనడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, రాజేష్ వర్మ, పిళ్లా విజయ్‌కుమార్, కర్రోతు నర్సింగరావు, గంటా రవి, అవనాపు విజయ్, నడిపిల్లి రవికుమార్ పాల్గొన్నారు.



ఇట్టే లాక్కెళ్తారు!

- చైన్‌స్నాచర్లతో జాగ్రత్త
- మాటల్లో పెట్టి చోరీలు
- ఒంటరి మహిళలే టార్గెట్
- వెలుగులోకి వచ్చినవి కొన్నే

- ఈ నెల 6న పూసపాటిరేగ మండలం నాతవలస జంక్షన్‌లో మహిళ మెడలో బంగారు ఆభరణాలు, చేతిలో ఉన్న సెల్ ఫోన్‌ను అగంతకులు పట్టుకుపోయారు. గుంపాం గ్రామానికి చెందిన మహంతి శ్రీనివాసరావు, రాజేశ్వరి దంపతులు విజయనగరంలో షాపింగ్ చేసి వస్తుండగా..ఇద్దరు యువకులు బైక్‌పై అనుసరించారు. బైక్ చక్రంలో లగేజీ బ్యాగు ఉండిపోయిందని చెప్పడంతో వారు బైక్ ఆపారు. వెంటనే రాజేశ్వరి మెడలో ఉన్న పుస్తెలతాడుతో పాటు చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు.
- గత ఏడాది మే 21న విజయనగరం సమీపంలో పశువులు మేపుతున్న గురుమూర్తమ్మ అనే మహిళ మెడలో బంగారం గొలుసు తెంపుకొని ఇద్దరు యువకులు పరారయ్యారు. బైక్‌పై వచ్చిన వారు వెనుక నుంచి వచ్చి గొలుసును తెంచారు.
- గత ఏడాది మార్చి 1న గంట్యాడ మండలం పెనసాం గ్రామానికి చెందిన లెంక వరహాలు అనే మహిళ మెడలో మూడు తులాల బంగారు ఆభరణాలను ఇద్దరు యువకులు తెంపుకుపోయారు. భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు బంగారు ఆభరణాలు తెంపుకొని పరారయ్యారు.

రాజాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో నెలకో చోట అయినా ఏదో మూలన చైన్‌స్నాచింగ్ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. చిన్న కేసులు బయటకు తెలియడం లేదు. పోలీసులకు ఫిర్యాదు వెళ్లినవే బయటపడుతున్నాయి. స్నాచింగ్ చోరులు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉన్నారు. ఒంటరి మహిళలనే ప్రధానంగా టార్గెట్ చేస్తున్నారు. షాపింగులు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసి రాత్రి సమయంలో వస్తున్న వారిపైనా గురిపెడుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముఠాలు జిల్లాలో తిరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 29 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఆపై అంతర్ రాష్ట్ర రహదారులు ఉన్నాయి. అయితే ప్రధాన రహదారులనే చైన్‌స్నాచర్లు దొంగతనాలకు ఎంచుకోవడం గమనార్హం. మరోవైపు అన్ని రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని పోలీస్ అధికారులు చెబుతున్నారు. కానీ అవి పని చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే ప్రధాన రహదారులపై అమర్చిన కెమెరాలు కూడా సరిగా పనిచేయడం లేదు. దొంగతనాలు జరిగినా నిఘా కెమెరాలకు చిక్కడం లేదు. మరమ్మతులకు గురైన కెమెరాలను అలాగే వదిలేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

● ప్రయాణాల సమయాల్లో ఎక్కువగా ఆభరణాలు ధరించవద్దు. ● వీలైనంత వరకూ రాత్రిపూట ప్రయాణాలు తగ్గించాలి. ● మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారు ఆ మార్గంలో జనసంచారం ఉన్నప్పుడే ప్రయాణాలు చేయాలి. ● మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు చుట్టూ పరిసరాలను పరిశీలిస్తుండాలి. ● అపరిచిత వ్యక్తులు తారసపడినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ● జన సమ్మర్థం ఉన్న ప్రాంతాల్లోనే రాకపోకలు సాగించాలి. ● వాకింగ్‌కు వెళ్లే మహిళలు రహదారులపై కాకుండా పార్కులు, మైదానాల్లో చేసుకోవడం మంచిది. ● యువకులు, అనుమానాస్పద వ్యక్తులు అడ్రస్ అడిగేటప్పుడు వారికి దూరంగా నిల్చోవాలి. ఎవరూ లేని సమయంలో తాగునీరు ఇవ్వండి.. అద్దెకు ఇల్లు ఉందా.. అంటూ మాట కలిపినప్పుడు దూరంగా ఉండి మాట్లాడండి.

● బైక్‌పై దంపతులు వెళుతున్నప్పుడు అనుసరించేవారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వెంటపడినట్టు అనిపిస్తే బైక్‌ను జనాలు ఉండే చోట నిలపాలి.

చర్యలు తీసుకుంటున్నాం..

ప్రజా సహకారంతోనే దొంగతనాల నియంత్రణ సాధ్యం. పోలీస్‌శాఖపరంగా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ఒంటరి మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒంటరిగా రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడు అపరిచితులు తారసపడితే దూరంగా వెళ్లిపోవాలి. వీలైనంత వరకూ బయటకు వచ్చినప్పుడు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమం.

-కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం

రాజాంలో చైన్ స్నాచింగ్

రాజాం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబానగర్ రెండోలైన్‌లో బంగారు పుస్తెలతాడుని తెంపుకుపోయిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన పేర్ల లక్ష్మి తన ఇంటివద్ద ఉన్న సమయంలో అటుగా వచ్చిన అగంతకుడు లక్ష్మి ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. అటూఇటూ చూసి ఎవ్వరూ లేరని నిర్ధారించుకుని ఆమెపై అటాక్ చేశాడు. మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపి పరారీ అయ్యాడు. లక్ష్మి కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు లక్ష్మి నుంచి వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేయాల్సి ఉంది.

పాఠశాల ప్రహరీలపై
నిర్లక్ష్యమెందుకు?

- పనులు గ్రౌండింగ్ చేయకపోతే రద్దు చేస్తాం: కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 153 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు చేస్తే ఇప్పటివరకూ ఒక్కటి కూడా గ్రౌండింగ్ కాలేదని కలెక్టర్ అంబేడ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తన చాంబర్‌లో పనులపై సమీక్షించారు. సోమవారం నాటికి అన్నింటినీ గ్రౌండింగ్ చేసి మార్చి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రౌండింగ్ చేయకపోతే పనులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉపాధి వేతనదారులకు పనికల్పన విషయంలో ఇప్పటివరకూ 69 వేల పనిదినాలు కల్పించామని, మార్చి నాటికి 77 లక్షల పనిదినాలు కల్పించాలని చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమం కింద జిల్లాలో 2042 సీసీ రోడ్ల పనులు మంజూరు చేయగా, వీటిలో ఇప్పటి వరకూ 1969 రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారని చెప్పారు. వీటిని వారంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొదటి విడతగా 996 గోకులాలను మంజూరు చేయగా, 994 గ్రౌండింగ్ అయ్యాయని, వీటిలో 431 పూర్తయ్యాయని చెప్పారు. ఐదు రోజుల్లో మిగిలిన వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే నెల మొదటి వారంలో రెండో విడత కింద సుమారు 1000 గోకులాల నిర్మాణాన్ని ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శారద, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కణపాకలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్

విజయనగరంలోని కణపాకలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, 3వ పట్టణ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్ గురువారం స్థల పరిశీలన చేశారు. ఇక్కడి సర్వే నెంబరు 15-1లో సుమారు ఎకరా స్థలాన్ని ఈ భవనాల కోసం పరిశీలించారు. తహసీల్దార్ కూర్మనాథరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలాన్ని రెండు భాగాలుగా చేసి సగం తహసీల్దార్ కార్యాలయానికి, మిగిలిన సగం పోలీసు స్టేషన్ నిర్మాణానికి కేటాయించాలని ఆదేశించారు.



స్థల పరిశీలనలో కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజల ఆయుష్‌కు! భరోసా ఉందా?



- పుట్టగొడుగుల్లా మందుల విక్రయ కేంద్రాలు, మెడికల్ షాపులు
- నాణ్యత ప్రశ్నార్థకం.. బిల్లులు అడిగినా ఇవ్వరు
- లైసెన్సు లేకుండా నిర్వహణ.. పర్యవేక్షించని ఆయుష్ విభాగం

ఆరోగ్యానికి భరోసాగా నిలవాల్సిన ఆయుష్ విభాగం మొక్కుబడి పర్యవేక్షణకే పరిమితమైంది. జిల్లాలో హోమియో, ఆయుర్వేద వైద్యం అందుతున్న తీరుపై కనీస స్థాయిలో నిఘా పెట్టడం లేదు. దుకాణాలు సరిగా నిర్వహిస్తున్నారా..? లైసెన్సు ఉందా..? మందులు నాణ్యతగా ఉంటున్నాయా..? బిల్లు ఇస్తున్నారా..? అని తనిఖీలు చేయడం లేదు. దీంతో జిల్లా అంతటా పుట్టగొడుగుల్లా ఆయుర్వేద, హోమియో మందుల విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వాటిని విక్రయిస్తున్నారు. కొనుగోలు చేశాక బిల్లు అడిగినా ఇవ్వడం లేదు.

విజయనగరం రింగురోడ్డు, జనవరి 23(ఆంధ్రజ్యోతి):

ఇంగ్లీష్ వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆయుర్వేదం, హోమియో వైద్యంపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. మారిన ప్రజల ఆలోచన ఆ రంగంలో వున్న వారికి కాసులు కురిపిస్తోంది. అయితే ఇంగ్లీష్ మందుల షాపుల మాదిరిగానే వీటికి కూడా లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్‌ను ఆయుష్‌శాఖ జారీ చేస్తుంది. ఆయుష్‌శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నవి జిల్లాలో ఎనిమిది దుకాణాలు మాత్రమే వుండగా, మిగతా వేటికీ లైసెన్సులు లేవు. ఆ ఎనిమిదింట్లో కూడా కొన్ని లైసెన్సులు రెన్యువల్ కాలేదని సమాచారం. జిల్లాలో అనుమతి లేని హోమియో, ఆయుర్వేద వైద్యాలయాలు, షాపులు 70 పైగా వున్నాయి. ఫుట్‌పాత్‌పైనా మందులు అమ్మేస్తున్నారు. దీనిపై కూడా ఆయుష్‌శాఖ పర్యవేక్షణ లేదు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఆయుష్ విభాగం ఉన్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు లేరు. నాలుగు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. విజయవాడలోని కేంద్ర కార్యాలయం నుంచి అడిషనల్ డైరెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. దీంతో జిల్లాలో అక్రమంగా మందుల అమ్మకాలు చేపట్టేవారికి కొదవ లేదు. పైగా మందుల ధరలూ ఎక్కువ. నాణ్యత ప్రశ్నార్థకం. బిల్లు అడిగిన వారికి నిర్లక్ష్యపు సమాధానమే వస్తోంది. నచ్చితే కొనండి.. లేదంటే వెళ్లండి అని మొహంపై (మిగతా 8వ పేజీలో...)



వివిధ మొక్కల వేర్లతో మూలికలు





వేగావతి నదిలో వంతెన నిర్మాణ పనులు

6 లో

శరవేగంగా పారాది వంతెన నిర్మాణం

- ఏడాదిలోగా పూర్తి చేయాలని లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారాది వంతెన పనులు జోరందుకున్నాయి. రూ.10.90 కోట్లు ఉండే నిర్మాణ వ్యయాన్ని రూ.13.40 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

సొంతంగా సాధన... విజయాల బాటన!


- వాలీబాల్‌లో రాణిస్తున్న చినమేరంగి యువకులు
- శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు సాధిస్తామని విశ్వాసం

6 లో

బొబ్బిలి యుద్ధం @ 227 ఏళ్లు

- నేడు యుద్ధ స్మారక స్తూపం వద్ద నివాళి అర్పించనున్న బొబ్బిలి రాజ వంశీయులు, అభిమానులు

6 లో



భావి తరాలకు ఉచిత విద్యుత్

- సూర్యఘర్ యోజన అమలుపై మంత్రి శ్రీనివాస్

7 లో

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

- రామభద్రపురం మండలం కొట్టక్కిలో ఈనెల 15న వృద్ధురాలి హత్య
- డబ్బు కోసం ఘాతుకం

7 లో

సొంతంగా సాధన.. విజయాల బాటన

● వాలీబాల్‌లో రాణిస్తున్న చినమేరంగి యువకులు ● శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు సాధిస్తామని విశ్వాసం



గత ఏడాది కాలంలో సాధించిన ట్రోఫీలతో చినమేరంగి జట్టు

జియ్యమ్మవలస, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎవరి దగ్గరా ప్రత్యేకంగా శిక్షణ పొందలేదు. టీవీలు..చుట్టు పక్కల గ్రామాలలో జరిగే పోటీలు... ఆటలే వారికి మొదటి గురువులు. అలా పరిశీలనతో నేర్చుకున్న ఆటలో నిరంతరం సాధన చేస్తూ బహుమతులు సొంతం చేసుకుంటున్నారు చినమేరంగి గ్రామానికి చెందిన నవ చైతన్య యువజన సంఘ యువకులు. ఈ క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో అనేకవిజయాలను వారి ఖాతాలో వేసుకున్నారు. మూడు దశాబ్దాలుగా వీరు ఎక్కడ పోటీలకు వెళ్లినా గెలుపుతో తిరిగి వస్తున్నారు. వీరందరూ దళిత యువకులే. స్థానిక దళితవాడకు ఆనుకొని ఉన్న చిన్న ఆట స్థలమే వీరి సాధనకు కేంద్రం. ఇక్కడ రాణించిన వారిలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన మీసాల కుమారస్వామి (ఆర్మ్‌డు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్) కూడా ఈ దళితవాడకు చెందిన వాడే. వీరి సాధన తీరును చూసి ముచ్చటపడి... ముందుకు నడిపిస్తున్న రిటైర్డ్ పీడీ వెలగాడ గురువులు సాయంతో ప్రస్తుతం మెలకువలు నేర్చుకుంటున్నారు. వీరు సాధించిన అనేక విజయాల్లో మీసాల అభి, మీసాల సంజయ్ కుమార్, బొమ్మాళి రాజ్‌కుమార్, మీసాల సుభాష్, రాయిపిల్లి మధు, వెలగాడ రవి, బొత్స అఖిల్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

విజయాలు అనేకం..

ఈ క్రీడాకారులు ఎక్కడికి వెళ్లినా బహుమతి సొంతం చేసుకోవాల్సిందే అన్నట్టుగా సాధన చేసి.. విజయాలు సాధిస్తున్నారు. గత ఏడాది కాలంలో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో ని వివిధ ప్రాంతాల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఏకంగా 20 ట్రోఫీలు సాధించడం వీరి ప్రతిభకు నిదర్శనం. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా కొత్తపేటలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఒడిశా రాష్ట్రం బాకురుగూడ, అమలాబట్టా, కురుపాం మండలం మధురవలస, వీరఘట్టం, జియ్యమ్మ వలస మండలం పెదమేరంగి తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది కాలంలో జరిగిన వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. తాము ఎన్ని విజయాలు సాధిస్తున్నా... జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపికల్లో మాత్రం సెలక్షన్ కమిటీలు తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయని ఈ క్రీడాకారులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందితే అటు క్రీడల్లో ప్రతిభ చూపడంతో పాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అవకాశం ఉంటుందని వారంతా కోరుతున్నారు.



కొత్తపేటలో జరిగిన అంతర్ రాష్ట్ర పోటీల విజేతగా.. (ఫైల్)

సొంతంగానే సాధన..



మా పెదనాన్న కుమారస్వామి, మా నాన్న ఉదయ్ కుమార్‌ల స్ఫూర్తితో చిన్నప్పటి నుంచి సొంతంగా సాధన చేస్తూ ఆటలో పట్టు సాధించాను. అంతర్ రాష్ట్ర పోటీల్లో రాణించగలుగుతున్నాను.

-మీసాల అభి

శిక్షణ ఇస్తే మరింత రాణిస్తాం..



సొంతంగా సాధన చేస్తూ జిల్లా, అంతర్ రాష్ట్ర స్థాయిల్లో రాణించగలుగుతున్నాం. మాకు సరైన శిక్షణ ఇస్తే మరింతగా రాణించగలమనే నమ్మకం ఉంది.

-రాయిపిల్లి మధు

పక్కన పెడుతున్నారు..



నేను, మా టీమ్‌లోని క్రీడాకారులం చాలాసార్లు జిల్లా, రాష్ట్రస్థాయి జట్టులో ఎంపికలకు వెళ్లాం. కానీ ఎంత ప్రతిభ చూపినా చినమేరంగి అనగానే పక్కన పెట్టేస్తున్నారు.

-బొమ్మాళి రాజ్‌కుమార్

మాకు అవకాశం ఇవ్వండి..



మాకు మంచి శిక్షణ అందించి జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపికల్లో అవకాశాలు కల్పించాలి. జిల్లా క్రీడల శాఖ, కలెక్టర్ చొరవ చూపి న్యాయం చేయాలి.

-బొత్స అఖిల్

వివక్ష ఉంది..



మూడు దశాబ్దాలుగా వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నాం. మా ఆట తీరు చూసి... జిల్లా, అంతర్ రాష్ట్ర స్థాయిలలో ఎందరో అధికారులు మెచ్చుకున్నారు. కానీ ఎంపిక విషయానికి వచ్చేసరికి చినమేరంగి అనగానే వివక్ష చూపుతూ వస్తున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

-వెలగాడ గురువులు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, చినమేరంగి



వేగావతి నదిపై జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

శరవేగంగా పారాది వంతెన నిర్మాణం

● ఏడాదిలోగా పూర్తి చేయాలని లక్ష్యం

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వెళ్లే రాష్ట్రీయ రహదారిలో పారాది దగ్గర వేగావతి నదిపై వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. బ్రిటీష కాలంలో నిర్మించిన ఇక్కడి వంతెన శిథిలమై పోయింది. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే కొత్త వంతెన కోసం సుమారు రూ. పది కోట్లు మంజూరు చేశారు. శంకుస్థాపన పూర్తయింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు అడుగు కూడా కదల్లేదు. మళ్లీ వైసీపీ నాయకులు హడావిడిగా శంకుస్థాపన చేసి... చేతులు దులుపుకున్నారు. ఈ వంతెన నిర్మాణ వ్యయం ఒక్కసారిగా రూ.13.40 కోట్లకు పెరిగిపోయింది. పనులు సాగకపోవడం... పాత వంతెన రాకపోకలకు పనికి రాకపోవడంతో ఆ తరువాత ప్రజల ట్రాఫిక్ కష్టాలకు అంతు లేకుండా పోయింది.

వంతెన కుంగిపోయి...

మూడేళ్ల క్రితం వంతెన ఓ పక్కకు కుంగిపోవడంతో దీనిపై నుంచి వాహనాల రాకపోకలను కట్టడి చేశారు. నదిపై డైవర్షన్ రోడ్డు వేశారు. అది నాలుగైదుసార్లు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో వాహన చోదకులు ఇక్కట్లకు గురైన సంగతి తెలిసిందే. రాయపూర్-విశాఖ ప్రాంతాలకు ఈ వంతెనపై నుంచి రోజూ భారీ వాహనాలతో పాటు వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు వంటివి ప్రయాణాలు సాగిస్తాయి. వంతెన కుంగిపోవడంతో బొబ్బిలి పట్టణం మీదుగా తెర్లాం, పినపెంకి రోడ్లు మీద నుంచి వాహనాలను మళ్లించారు. దీంతో ఆ గ్రామీణ రోడ్లన్నీ పూర్తి గా దెబ్బతిన్నాయి.

కూటమి హయాంలో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పారాది వంతెన పనులు మళ్లీ కదిలాయి. రూ.10.90 కోట్లు ఉండే నిర్మాణ వ్యయాన్ని రూ.13.40 కోట్లకు పెంచుతూ నిధులు మంజూరు చేసింది. నదిలో 52 ఫైల్ ఫౌండేషన్ పనులను ప్రారంభించారు. వీటిలో 40 శాతం పనులను పూర్తి చేశారు. మిగిలినవి చురుగ్గా సాగుతున్నాయి.

40 శాతం పనులు పూర్తి..

పారాది వంతెనకు సంబంధించి సుమారు 40 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.4.50 కోట్ల విలువైన పనులు జరిగాయి. 40 ఫైల్ ఫౌండేషన్ పనులను పూర్తి చేశారు. రూ.కోటిన్నర బిల్లులను సిద్ధం చేశాం. అన్నీ అనుకూలిస్తే ఏడాదిలోగా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.

-బీఏ రాజు, ఆర్అండ్‌బీ ఏఈ, బొబ్బిలి

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని టీడీపీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేకులు కట్ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అన్నదానం, దుస్తుల పంపిణీ చేశారు. లోకేశ్ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



సాలూరు: ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తదితరులు



విజయనగరం: రక్తదానం చేస్తున్న టీడీపీ శ్రేణులు



రామభద్రపురం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



గుమ్మలక్ష్మీపురం: కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే జగదీశ్వరి తదితరులు



విజయనగరం: కేక్ కట్ చేసిన మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, బేబీనాయన, ఎంపీ కలిశెట్టి తదితరులు



గుర్ల: చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు తదితరులు



లక్కవరపుకోట: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

బొబ్బిలి యుద్ధం @ 227 ఏళ్లు



బొబ్బిలి కోట

బొబ్బిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలోనే అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న బొబ్బిలి యుద్ధం జరిగి శుక్రవారం నాటికి 227 ఏళ్లు పూర్తి కానున్నాయి. విజయనగరం-బొబ్బిలి రాజుల మధ్య 1757 జనవరి 24న బొబ్బిలి యుద్ధం జరిగింది. ఫ్రెంచ్ దేశస్థుడైన బుస్సీ ప్రోద్బలంతో బొబ్బిలి రాజులపైకి విజయనగరం రాజులు దండెత్తి... కోటను ఫిరంగులతో ధ్వంసం చేశారు. ఇక్కడి రాజవంశీయులను, సైన్యాన్ని సమూలంగా అంతమొందించడం... స్త్రీలు ఆత్మాభిమానంతో ఆత్మాహుతికి పాల్పడడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ యుద్ధానికి సంబంధించి అనేక జానపద కథలు, బుర్రకథలు, సినిమాలు వెలువడ్డాయి. రాజాంలో ఉంటున్న తాండ్రపాపారాయుడు బొబ్బిలిలో జరిగిన ఘోరాలను తెలుసుకొని.. యుద్ధం జరిగిన మూడో రోజున బొబ్బిలి శిబిరంలో నిద్రిస్తున్న విజయనగరం రాజు పూసపాటి విజయరామరాజును కత్తితో పొడిచి హతమార్చాడు. బొబ్బిలి రాజా గోపాలకృష్ణరంగారావు సతీమణి రాణిమల్లమ్మదేవికి తాండ్రపాపారాయుడు స్వయానా సోదరుడు. బొబ్బిలి రాజులపై మమకారంతో తాండ్ర పాపారాయుడు తన ప్రతాపాన్ని చాటుకొని వీరమరణం పొందాడు. ఆయన పేరు, పౌరుషాన్ని ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటారు.



బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు



తాండ్రపాపారాయుడి విగ్రహం

నేడు నివాళులు..

బొబ్బిలి యుద్ధ స్మారకస్తూపం, తాండ్ర పాపారాయుడు, దివంగత బొబ్బిలి రాజా విగ్రహాలకు, వీర సైనికులకు శుక్రవారం రాజవంశీయుడైన ఎమ్మెల్యే ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) నివాళులు అర్పించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఘటాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

దేశమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మేలో జరగనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండగ నేపథ్యంలో గ్రామదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాలూరులోని బంగారమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారి చెట్టుకు పూజలు చేశారు. అగురు వీధి వాసులు ఘటాలతో తిరువీధిగా ఆలయానికి చేరుకున్నారు.



అమ్మవారి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

27న శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత శిక్షణకు ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సదుపాయం కల్పిస్తామన్నారు. బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్, జంట్స్ టైలరింగ్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ విభాగాలకు 30 రోజులు, డీటీపీ 45 రోజులు, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్‌కు 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 90147 16255, 94917 41129, 98669 13371లను సంప్రదించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.1.37 లక్షలు

రాజాం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పటణంలోని నవదుర్గ అమ్మవారికి రూ.1,31,457 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో పొన్నాడ శ్యామలరావు తెలిపారు. 85 రోజులుగా అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను గురువారం తెరిచి లెక్కించామన్నారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరసింగరావు, భవానీ గురుస్వామి కూరాడ వెంకటరావు, కమిటీసభ్యులు పాల్గొన్నారన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చీపురుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా. పీవీ కృష్ణాజీ ఒక గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఈ మేళాకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎమ్మెస్సీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు హాజరుకావచ్చని ఆయన తెలిపారు.

'స్త్రీనిధి' గోల్‌మాల్‌పై విచారణ

జామి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం పరిధిలోని స్వయంశక్తి సంఘాలకు చెందిన స్త్రీనిధి రుణాల గోల్‌మాల్‌పై ఏపీఎం మధు మహేష్ విచారణ ప్రారంభించారు. గ్రామంలో 25 మహిళా సంఘాల పరిధిలో రూ.10 లక్షల మేర నిధులు గోల్‌మాల్ జరిగాయని భావిస్తున్నారు. సిబ్బంది బదిలీలు జరిగే సమయంలో వారు వెళ్లిన తరువాత ఆడిట్ నిర్వహిస్తామని అందులో ఈవిషయం వెలుగులోకి వచ్చిందన్నారు. బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు నోటీసులు పంపించామన్నారు. తొలగించిన వీఏఏలు, ఆయా సంఘాల సభ్యులు, బదిలీపై వెళ్లిన వారి సమక్షంలో విచారణ చేపడతామన్నారు.

నేడు పోస్టల్ మెగా మేళా

విజయనగరం రింగురోడ్డు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో మెగా మేళాను నిర్వహించనున్నట్టు తపాలాశాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం తపాలా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలకు స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహాసభను జయప్రదం చేయండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్విమ్స్ బాప్టిస్ట్ చర్చి (ఎస్ఎంఎస్)లో ఈ నెల 25, 26 తేదీల్లో 70 సీబీసీఎన్‌సీ మహాసభలు నిర్వహిస్తామని ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్ జాన్ తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆచార్య వై.ప్రభాకర్, డాని కృపానంద్, సాల్మాన్, అరవింద్ పాల్గొన్నారు.

నేడు డ్రైవర్లకు నేత్ర పరీక్షలు

విజయనగరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవర్లకు శుక్రవారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్టు రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భావితరాలకు ఉచిత విద్యుత్

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం జనవరి 23 (ఆంధ్రజ్యోతి) మన ఇంట్లో మనమే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని భావితరాలకు ఉచిత విద్యుత్ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని శ్రీ కన్వెన్సన్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన అమలుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటి విద్యుత్ వినియోగం తగ్గించుకోనేలా ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదేళ్ల కష్టపడి సోలార్ విద్యుత్‌ను వినియోగించుకుంటే 20 ఏళ్ల ఉచితంగా విద్యుత్‌ను పొందవచ్చునన్నారు. ఏడాదికి సోలార్ విద్యుత్ ఒక కిలో వాట్‌కు రూ.8 వేలు, 2 కిలో వాట్‌లకు రూ.20 వేలు, 3 కిలో వాట్‌లకు రూ.32 వేలు ఆదా చేసుకోవచ్చునని సూచించారు. ప్రభుత్వం ఇందుకు అవసరమైన రాయితీతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా చెల్లిస్తే మిగిలిన మొత్తం బ్యాంక్ రుణం రూపంలో అందజేస్తుందన్నారు. అలాగే రైతులు తమ పొలాల్లో సాగు చేయకుంటే ప్రభుత్వమే లీజుకు తీసుకుని సోలార్ ఏర్పాటు చేసి పంటల సాగు చేసే విదంగా చర్యలు చేపడుతుందన్నారు. అందుకు రైతుకు ఏడాదికి అందుకు తగ్గ నగదును వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. జిల్లాలో గజపతినగరం నియోజకవర్గంలోని పురిటిపెంట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేశామన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ కోటి కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందజేయాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి

విజయనగరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 8న నిర్వహించనున్నామని, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. గురువారం పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులతో జిల్లా న్యాయస్థానం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కాదగిన అన్ని క్రిమినల్, చెక్కు బౌన్స్ కేసులను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి ఎం.మీనాదేవి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి దేవి రత్నకుమారి, న్యాయమూర్తులు రమ్య, పి.బుజ్జి, శ్రీనివాస్, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత తగదు

చీపురుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడాన్ని పీఆర్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో చేపట్టే మార్పులు, ఆ రంగాన్ని పరిరక్షించేందుకు తోడ్పడాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక స్థాయికి మార్పు చేయడం, ఐదు తరగతులు ఉన్న పాఠశాలల్లో కొన్నింటిని ఒకటి, రెండు తరగతులకు పరిమితం చేయడాన్ని తమ సంఘం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

నూతన విధానాలతో సాగు మేలు

డెంకాడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రైతులు నూతన విధానాలతో వ్యవసాయాన్ని చేసినట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. మండలంలోని అక్కివరంలో గురువారం నెల్లిమర్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖాధికారులు డ్రోన్‌ల సహాయంతో వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిలా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు, విజయనగరం ఏడీఏ నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సొంత భవనం కేటాయించండి

రాజాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజాం బీసీ బాలుర ప్రత్యేక వసతి గృహానికి సొంత భవనం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వసతి గృహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 120 మంది విద్యార్థులకు పైగా ఉన్న కళాశాల వసతిగృహానికి పదేళ్లగా సొంత భవనం లేకపోవడం అన్యాయమన్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సొంత భవనం సమకూర్చాలని కోరారు. ఆయనతో పాటు వెంకటరమణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

భోగాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అతిసారం వ్యాధిపై వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జీవన్‌రాణి అన్నారు. పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. డయేరియా కేసులపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జయకుమారి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇంజినీర్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విజయగనరం, డెంకాడ, రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, భోగాపురం, మెరకముడిదాంల్లో సరఫరా ఉండదన్నారు.

మంత్రి, ఎంపీకి వినతిప్రతాలు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో కలెక్టర్, జేసీ తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని జిల్లా సర్వే శాఖలో పనిచేస్తున్న సర్వేయర్లు గురువారం రాష మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ, కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజులకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. సర్వేయర్లుకు ఇచ్చిన మెమోలను వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతుల పరిష్కారంపై దృష్టి సారించండి

వంగర, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన వినతులను పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోషఫ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినతుల పరిష్కారానికిప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్షలలో తహసీల్దార్ ధర్మారావు పాల్గొన్నారు.

● భోగాపురం: రెవెన్యూ సదస్సుల్లో అందిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుల నెల్లిమర్ల నియోజకవర్గ ప్రత్యేక అధికారి సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన గ్రీవెన్స్‌పై ఆరా తీశారు. ఎండార్స్‌మెంట్, విచారణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ రవి ఉన్నారు.

పీఈటీల సేవలు అభినందనీయం

విజయనగరం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియలో పీఈటీల సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో పీఈటీలను అభినందించి జ్ఞాపికను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐలు లీలారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోండి

కొత్తవలస, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ డి.సురేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని దేశపాత్రునిపాలెంలో విద్యుత్ వినియోగదారులకు సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తవలస ఏఈ అప్పారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

జామి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జామిలో గురువారం స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● గరివిడి: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ లోకేశ్వరరావు పిలుపునిచ్చారు. గరివిడిలో సహాయ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన వేడుకల్లో ఎస్ఐ పాల్గొన్నారు.

● రాజాం: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని రాజాంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, బూరాడ శివకృష్ణ, గట్టి పాపారావు పాల్గొన్నారు..

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

క్రైం కార్నర్

రామభద్రపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో ఈనెల 15న వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఎటకేలకు ఛేదించారు. మద్యం మత్తులో ఇద్దరు యువకులు కొద్దిపాటి డబ్బు కోసమే ఆమెను హత్య చేశారని ప్రాథమికంగా తేల్చారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రూ రల్ సీఐ కె.నారాయణరావు హత్య కేసు వివరాలను విలేకర్లకు వెల్లడించారు. నిందితులను విలేకర్ల ముందు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన లోపింటి గణేష్, ముత్యాల శ్రీనులు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు మెకానిక్‌లుగా జీవనం సాగిస్తున్నారు. అయితే ముందురోజు రాత్రి ఇద్దరు మద్యం తాగి, ఆమె దగ్గర డబ్బులు తీసుకోవడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా రాత్రి రూ.10:30 గంటల సమయంలో మృతురాలు దిండి సింహాచలం మూత్రవిసర్జనకు బయటకు రాగా ఒక్కసారిగా వీరు ఇంటిలోకి చొరబడ్డారు. అనంతరం ఇంట్లోకి వచ్చిన ఆమె.. వారిని చూసి కేకలు వేసింది. దీంతో వారు ఆమె నోరు నొక్కే ప్రయత్నం చేశారు. తలగడతో అదిమి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. అనంతరం వారిపై అనుమానం రాకుండా ఉండేందుకు చీరతో ఫ్యాన్ కొక్కెంకు ఉరి వేసుకున్నట్టు మృతదేహాన్ని వేలాడ దీశారు. అనంతరం పక్కనే ఉన్న గొడ్డలితో బీరువాను పగలుగొట్టి రూ.10వేల నగదుతోపాటు ఆమె ముక్కులో ఉన్న పావు తులం బంగారం వస్తువులు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం వీరిద్దరు రూ.10వేలను పంచుకోవడమే కాకుండా బంగారపు వస్తువును ఒక ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టి ఆ డబ్బులు కూడా పంచుకున్నారు. అయితే ఈ కేసులు మొదటి నుంచి అనుమానంగానే చూసి విజయనగరం నుంచి వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్ తెప్పించి ఘటనా స్థలంలో క్షుణ్ణంగా పరిశీలించారు. అప్పటి బొబ్బిలి డీఎస్పీ పోలిరెడ్డి శ్రీనివాసరావు, రూరల్ సీఐ నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుల్లో ఒకరైన లోపింటి గణేష్ గతంలో ఒక ఇంటి దొంగతనం కేసులో అరెస్టయ్యాడు. అప్పట్లో అతని వేలిముద్రలు ఇప్పుడు బీరువా మీద ఉన్న వేలిముద్రలు పరిశీలించగా ఒకటిగా తేలడంతో ఈ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. అతనిని విచారించగా మిగతా నిందితుడి వివరాలు కూడా తెలిపాడు. అయితే వీరు మద్యంమత్తులో కొద్దిపాటి డబ్బుల కోసమే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఒక నిండు ప్రాణాన్ని బలికొన్నారని పోలీసులు తెలిపారు. అయితే లోపింటి గణేష్ ఈనెల 22న కొట్టక్కి వీఆర్వో సాంబశివరావు దగ్గర లొంగిపోగా, 23న ముత్యాల శ్రీనును కొట్టక్కి వద్ద అరెస్టు చేసి గురువారం సాలూరు కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

7 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

శృంగవరపుకోట రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనాపల్లి వద్ద గురువారం సాయంత్రం ఆటోలో తరలిస్తున్న 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను వీఆర్‌వో సముద్రం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వీఆర్‌వో అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆటోలో పీడీఎఫ్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెనువెంటనే రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్నామన్నారు. ఆటోను, బియ్యంను స్వాధీనం చేసుకుని 6-ఏకేసు నమోదు చేశామన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం టాస్క్‌ఫోర్స్, కొత్తవలస ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్లు నల్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు కొత్తవలస సీఐ రాజశేఖరనాయుడు తెలిపారు. మండలంలోని రామలింగపురం గ్రామ శివారు ప్రాంతంలో గాలించడంతో బెల్లం ఊటలు బయటపడ్డాయన్నారు. దాడుల్లో విజయనగరానికి చెందిన ఈఎస్‌టీఎఫ్ పి.రామచంద్రకుమార్, రాజు, టి.వీర్రాజు, శ్రీను, దుర్గారావు పాల్గొన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భోగాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నారుపేట వద్ద సర్వీస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారని ఎస్ఐ పాపారావు తెలిపారు. పెద్దాపురానికి చెందిన ఎస్.వాసు ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా.. డెంకాడ మండలం అక్కివరానికి చెందిన ఇ.జగదీష్ ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు వెళ్తున్నారు. ఇద్దరి ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

డెంకాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపా సమీపంలోని మామిడి తోటలో గురువారం దాడు నిర్వహించిన ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. వారి నుంచి రూ.1,27,130 నగదు, 5 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సారాతో ఇద్దరు మహిళల అరెస్టు

మెంటాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాణిజ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను 4 లీటర్లు సారాతో గురువారం గజపతినగరం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల నుంచి సారాను తెస్తున్నట్టు గుర్తించి లోతుగెడ్డ, ఆంధ్ర గ్రామాల శివారులో గజపతినగరం ఎక్సైజ్ పోలీసులు వారిపై దాడి చేశారు. దాడితో ఎస్ఐ పి.నరేంద్ర కుమార్, హెచ్‌సీలు పీబీఎస్‌వీఆర్ రాజు, బాషా, కానిస్టేబుల్ ఫాతిమాబేగం పాల్గొన్నారు.

సారాతో మరొకరు..

రాజాం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వంగర మండలం కోదులగుమ్మడ గ్రామానికి చెందిన బొత్స మురళీని 3.6 లీటర్లు సారాతో అరెస్టు చేశామని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. సారా అమ్మకాలు నిరోధించడంతో భాగంగా దాడి చేసి పట్టుకున్నామన్నారు.

నేర విచారణకు సీసీ కెమెరాలు దోహదం

నెల్లిమర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేర విచారణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ అన్నారు. ఈమేరకు గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుకు ఆనుకుని రెండు హైక్వాలిటీ సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.గణేష్ ఉన్నారు.

జనసేన పార్టీలో చేరిక



కండువా వేస్తున్న ఎమ్మెల్యే

భోగాపురం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీపంలోని జనసేన పార్టీ కార్యా లయంలో గురువారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో నెల్లిమర్ల మండం సతివాడ గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. చింతపల్లి శ్రీనివాస్, చందక సత్యం, మీసాల కాంచినాయుడు, గెడ్డసాయిలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



విజయనగరం: రక్తదాన శిబిరం వద్ద ఎంపీ కలిశెట్టి, అవనాపు విజయ్

నెల్లిమర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామతీర్థంలోని రామస్వామి వారి దేవస్థానంలో లోకేశ్ పేరిట పూజలు నిర్వహించారు. తర్వాత కర్రోతు బంగార్రాజుతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి తదితరులు బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం దేవస్థానంలోని నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మండలంలోని గొర్లెపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రయంలో పార్టీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, కోటపాటి తిరుపతిరావు, తాడ్డి సత్యనారాయణ, బొంతు వెంకటరమణ, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, దన్నాన రామ్మూర్తి, డి.అజయ్‌బాబు, కళావతి పాల్గొన్నారు.

● జామి: టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి లోకేశ్ నమదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రామయ్యపాలెంలో వెలమ కార్పొరేషన్ డైరక్టర్ శ్రీలక్ష్మి వృద్ధులకు పండ్లు, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

● గరివిడి: రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు కె.ఎల్.పురంలో టీడీపీ నాయకుడు, సర్పంచ్ పాండ్రంకి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పుట్టినరోజు కేక్‌ను కట్‌చేసి గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోట్ల రామారావు, హెచ్ఎం పి.వి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

● గజపతినగరం: టీడీపీ యువనేత లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం గజపతినగరంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మనాయుడు స్వగృహంలో నిర్వహంచిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు బాలాజీ, మాజీ ఆసుపత్రి చైర్మన్ మిత్తిరెడ్డి రమణ, రామునాయుడు, వేమలి చైతన్య, గోపి పాల్గొన్నారు.

● రాజాం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం రాజాంలో టీడీపీ సీనియర్ నాయకుడు కోండ్రు జగదీశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం చీపురుపల్లి రోడ్డులోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అలాగే రాజాం పట్టణంలో పరిధిలోని కొండంపేటలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, మద్దు హరి, మరిపి జగన్మోహనరావు, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, టంకాల నాగరాజు జరజాన నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

● భోగాపురం: రాష్ట్ర మంత్రి లోకేశ్ నిండునూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆకాంక్షించారు. పోలిపల్లిలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదినం వేడుకలు నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేశారు.

● డెంకాడ: టీడీపీ యువనేత, రాష్ట్ర మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం డెంకాడలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పాణిరాజు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన ఆదిబాబు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు.

● శృంగవరపుకోట రూరల్: మండలంలోని తిమిడిలో టీడీపీ జాతీయ కార్యదర్శి, విద్యా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్‌ఎంపీపీ సుదారాజు, ఎస్.కోట, తిమిడి సర్పంచ్‌లు గనివాడ సంతోష్‌కుమారి, ఒబ్బిన త్రినాథమ్మ, జనసేన నేత సన్యాసినాయుడు కేక్ కట్ చేశారు.

● కొత్తవలస: టీడీపీ మండల కార్యాలయంలో గురువారం టీడీపీ యువనేత, రాష్ట్ర మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొరపల్లి రాము అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు.



నెల్లిమర్ల: మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు కేక్ తినిపిస్తున్న రవిశేఖర్



గజపతినగరం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు



ఎస్.కోట: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

ప్రజల 'ఆయుష్'కు భరోసా ఉందా?

(5వ పేజీ తరువాయి)

చెప్పేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై పోరాడే వినియోగదారుల సంఘాలు కిమ్మనడం లేదు. కాగా ఆయుర్వేద, హోమియో వైద్యశాలలు, ఔషధ విక్రయ షాపులపై గతంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు చేశారు. వారి తనిఖీల్లో విస్తుపోయిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ఔషధాల విక్రయాలు, లైసెన్సు లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆయా షాపులను సీజ్ చేసి కేసులు కూడా నమోదు చేశారు. తర్వాత రోజుల్లో వారు కూడా పట్టించుకోవడం మానేశారు.

నాణ్యత లేకుంటే ప్రాణాలకు ముప్పు

హోమియో, ఆయుర్వేదం, యునానీకి సంబంధించి నాణ్యత లేని మందులు వినియోగిస్తే ప్రాణాలకు ముప్పు తప్పదు. అనారోగ్యానికి గురవుతారు. అనుభవజ్ఞులు మాత్రమే వైద్యం చేయాలి. అదే విధంగా ఆయుష్ శాఖ నుంచి లైసెన్సు పొందేవారు మాత్రమే ఔషధాలు విక్రయించాలి. అర్హత లేని వారు వైద్యం చేస్తే ఆరోగ్యానికి అపాయమే.

- డాక్టర్ ఎం.ఆనందరావు, ఆయుష్ విభాగం, జిల్లా కేంద్రాసుపత్రి

లైసెన్సు తప్పనిసరి

హోమియో, ఆయుర్వేదం, యునానికి సంబంధించి వైద్యశాలలు ఏర్పాటు చేయాలన్నా.. ఔషధాల విక్రయాలు చేపట్టాలన్నా ఆయుష్ విభాగం నుంచి తప్పనిసరిగా లైసెన్సు పొందాలి. నిర్దేశించిన సమయంలోగా వీటిని రెన్యువల్ కూడా చేయించుకోవాలి. లేకుంటే చట్టారీత్యా నేరం. ప్రభుత్వ గుర్తింపు పొందిన వారు మాత్రమే వైద్యం చేయాలి. ఔషధాలు విక్రయించాలి. వినియోగదారులు ఔషధాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. ఇవ్వని పక్షంలో వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరత విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నాం.

- డాక్టర్ సుజాత, అడిషనల్ డైరెక్టరు, రాష్ట్ర ఆయుష్ విభాగం

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామభద్రపురం మేజరు పంచాయతీని ఆదర్శవంతం గా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు, టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, పార్టీ నాయకులు బెవర సీతారాం, వసంతుల తిరుపతిరావు, భవిరెడ్డి చంద్ర, తాడ్డి శ్రీనివాసరావు, మేజరు పంచాయతీ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు పాల్గొన్నారు.

బియ్యం గోదాం ప్రారంభం

బొబ్బిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో నూతనంగా మంజూరైన బియ్యం గోదాంను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ప్రారంభించారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ గోదాంలో సుమారు 44 మందికి ఉపాధి కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఓ బియ్యపు బస్తాను ఆయన తన భుజంపై మోశారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించాలి

బొబ్బిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటిని సక్రమంగా, సమర్థవంతంగా సరఫరా చేయాలని, నిర్ణీత వేళలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పాతబొబ్బిలి తదితర ప్రాంతాలలో ఆమె గురువారం పర్యటించారు. కొళాయిల నుంచి వస్తున్న తాగునీటిని పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్ణీత సమయాల్లోనే తాగునీటిని విడుదల చేయాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని హితవు పలికారు. సాయిశార్వాణి టౌన్‌షిప్, మారుతి నగర్ తదితర ప్రాంతాలలో ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణ కోసం రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ ప్రతిరోజూ చెత్తసేకరణ చేయించాలని శానిటరీఇన్‌స్పెక్టరు మురళిని ఆదేశించారు. రోడ్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరగా దశలవారీగా మంజూరు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన అంచనాలను తయారు చేయాలని డీఈఈ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏఈ గుప్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

గుర్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం చినబంటుపల్లికి చెందిన కవుల గొల్ల, గౌరిల బిడ్డకు అరుదైన వ్యాధి సోకడంతో వారు తల్లడిల్లుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి సహకరిం చకపోవడంతో బిడ్డను బతికించుకునేందుకు దాతల సాయం కోరారు. ఈనేపథ్యంలో అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ యువకులు అండగా నిలిచారు. బుధవారం చీపురుపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన జనసైనికులు బాధితుల ఇంటి వచ్చి బాలుడి పరిస్థితిని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కలవచర్ల గ్రామానికి చెందిన జనసైనికుడు బెవర కూర్మారావు తక్షణ సాయం కింద బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. జనసేన పార్టీ గుర్ల మండల అధ్యక్షుడు యడ్ల సంతోష్, గుజ్జింగివలసకు చెందిన అట్టాడ కనికం నాయుడు, సారిక రామారావు, రెడ్డి రమణ, ఉక్కిడి సాయి, బూడి శ్రీను, పంచాది శ్రీను, బట్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కొయ్యకొండవలస గ్రామ పరిధిలో గురువారం రెండు లీటర్ల సారాతో ఒక మహిళను అదుపులోకి తీసుకున్నామని బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మెట్ట శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు సిబ్బందితో గ్రామంలో దాడు నిర్వహించామని చెప్పారు. ఆ దాడుల్లో సారాతో పట్టుబడిన మహిళను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఏనుగులను తరలించాల్సిందే..

- ఘనసరలో రైతుల ఆందోళన
- ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే జయకృష్ణ



ఎమ్మెల్యే జయకృష్ణ ఎదుట బైఠాయించిన రైతులు

భామిని, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏనుగులను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ ఘనసర గ్రామంలో గురువారం రైతులు ఆందోళన చేశారు. బుధవారం అటవీ అధికారులను నిర్బంధించిన నేపథ్యంలో ఎమ్మెల్యే జయకృష్ణ గురువారం అక్కడికి వెళ్లారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ఒకరిద్దరు అధికారులు వచ్చి పంట నష్టాలను నామమాత్రంగా పరిశీలించి వెళ్లిపోతున్నారని, పరిహారం అందించడం లేదని ఎమ్మెల్యే ఎదుట బైఠాయించారు. తానేదో చెప్పి వెళ్లిపోవానికి రాలేదని, ఏనుగుల కారణంగా 150 ఎకరాల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లుతుందని సమాచారం తెలిసే వచ్చానని ఆయన రైతులను ఓదార్చారు. ఏనుగులు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు పట్టుబడ్డారు. ఎమ్మెల్యే అక్కడి నుంచే డీఎఫ్‌వోతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె చెప్పే సమాధానంపై అసంతృప్తి చెందారు. 'మీరు తరలించలేనప్పుడు రైతులతో కలిసి మేమే తరలించేందుకు చర్యలు తీసుకుంటామని, అప్పుడు జంతు సంరక్షణ అంటే కుదరదు' అని డీఎఫ్‌వో తో చెప్పారు. అనంతరం కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి ఏనుగుల వల్ల రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. అటవీ అధికారి తీరుపై ప్రస్తావించారు. అలాగే ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌తో కూడా ఎమ్మెల్యే మాట్లాడారు. నాలుగు ఏనుగులు మైదానం, ఏజెన్సీ ప్రాంతాల్లో పంటలను నష్టం చేస్తున్నాయని తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఏనుగులు తరలించేందుకు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తూర్పు కాపు రాష్ట్ర డైరెక్టర్ సత్తిబాబు, తేజోవతితో పాటు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

ఘనంగా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కేక్‌కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● జియ్యమ్మ వలస: మంత్రి లోకేశ్ పుట్టిన రోజు సంద ర్భంగా గురువారం చినమేరంగి కోటలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు కేక్ కట్ చేశారు. డొంకాడ రామకృష్ణ, నంది వాడ కృష్ణబాబు, మజ్జి చంద్రమౌళి, ఎం.ప్రసాద్, ద్వారపురెడ్డి సోములు తదిత రులు పాల్గొన్నారు. ● కురుపాం: మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో కురుపాంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రజింత్‌కుమార్, మండల కన్వీనర్ కేవీ కొండయ్య, టీడీపీ నాయకులు బలగ రామకృష్ణ, సీహెచ్ రమాకృష్ణ, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా కిట్లను పంపిణీ చేశారు. ● కొమరాడ: లోకేశ్ జన్మదిన వేడుకలను మాదలంగి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్‌పాత్రుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ పాల్గొని, కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కిట్లును పంపిణీ చేశారు. ● రామభద్రపురం: మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలను రామభద్రపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: వేడుకల్లో మాజీ మంత్రి విజయరామరాజు



కురుపాంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేశ్..

అసందర్భ నిర్ణయాలు తగవు

- ఎంఈవోల తీరుపై ఉపాధ్యాయుల ఆందోళన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు విషయంలో అసందర్భ నిర్ణయాలు తగవని యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం బొబ్బిలి ఎంఈవో కార్యాలయం ముందు యూటీఎఫ్ బొబ్బిలి పట్టణ శాఖ గౌరవ అధ్యక్షుడు డీజేకే కిరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలన్నీ(17), మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో (8 నుంచి 10 కి.మీ దూరంలో) మ్యాపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ పాఠశాలల పట్ల ఎంఈవోల వైఖరి మారాలని, ఉపాధ్యాయుల అప్పీలను పరిగణలోకి తీసుకోకుండా స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయడం తగదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షురాలు పి.శారదారాణి, యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ పి.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, హేమ సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై ఆరా

తెర్లాం జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఎస్ఎస్‌వో నూకరాజు గురువారం తనిఖీ చేశారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు రెవెన్యూ సదస్సులపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటి వరకు 293 వినతులు స్వీకరించగా అందులో ఇప్పటికి 138 వినతులను పరిష్కరించామని చెప్పారు. అనంతరం ఎస్ఎస్‌వో రికార్డులను పరిశీలించారు. వీఆర్వోలకు పలు సూచనలు చేశారు.

ఆంగ్ల భాషా సామర్థ్యంపై పరీక్ష

బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం (డెల్టా) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాషా సామర్థ్య ప్రతిభా పాటవ పోటీ పరీక్షల నమూనా ప్రశ్న పత్రాలను బొబ్బిలి డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి కె.మోహనరావు గురువారం స్థానిక ఎమ్మార్సీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షను వచ్చే నెల ఫిబ్రవరి 2వ తేదీన బొబ్బిలిలో స్థానిక రాజా కాలేజీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ లక్ష్మణరావు, గొట్టాపు వాసుదేవరావు, డెల్టా అధ్యక్షుడు యం.విజయమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు భద్రత కల్పించాలి

రామభద్రపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ పెంకి చిట్టిబాబు కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కాలంలో బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై అంగన్‌వాడీలు ఎక్కువ దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అసోసియేట్ జిల్లా ప్రెసిడెంట్ భవిరెడ్డి శంకరరావు కూడా పాల్గొన్నారు.

కూనంబందవలస మీదుగా బస్సు నడపండి

- డయల్ యువర్ డీఎంలో వినతులు

సాలూరు రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కూనంబందవలస మీదుగా పాచిపెంటకు బస్సును నడపాలని విశ్వనాథపురం, మంచాడవలస, కొత్తవలసకు చెందిన పలువురు సాలూరు ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డిని కోరారు. ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ భాస్కరరెడ్డి గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూనంబందవలస మీదుగా పాచిపెంటకు బస్సును నడపాలని పలువురు కోరగా, ఈ విషయమై పరిశీలిస్తానని ఆయన వారికి హామీనిచ్చారు. రామభద్ర పురం కోవెల వద్ద బస్సులు నిలపాలని చింతల సాయి కోరారు. ఈ విషయమై సిబ్బందికి తగు సూచనలిస్తానని ఆయన హామీనిచ్చారు. సాలూరు నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను నడపాలని నీడ్ ఎన్జీవో ఎండీ పాచిపెంట వేణుగోపాలరావు కోరారు. ఈ విషయమై పరిశీలిస్తామని డీఎం తెలిపారు.

గణతంత్ర పరేడ్‌కు పూడివలస సర్పంచ్

బాడంగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పూడివలస సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడుకు అరుదైన గౌరవం దక్కింది. పూడివలసలో ఇంటింటి కొళాయిలు, మరుగుదొడ్లు, రోడ్లు, కాలువలు సంపూర్ణంగా ఉండడంతోపాటు పారిశుధ్యం బాగుండడం వల్ల ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్ చూసేందుకు ఆహ్వానం వచ్చిందని బాడంగి ఎంపీడీవో రామకృష్ణ గురువారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేయడంతో గుర్తింపు లభించిందని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా నేతాజీ జయంతి



బొబ్బిలి రూరల్: అలజంగిలో..

బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా అలజంగి సీబీఎం పాఠశాలలో హెచ్ఎం కృష్ణదాస్ ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ● పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సచివాలయ అడ్మిన్ శివ పూలమా లలు వేశారు. గ్రంథాలయ సహాయకురాలు నాగమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

రచయిత శ్రీనివాస్‌కు గిడుగు పురస్కారం

విజయనగరం రింగురోడ్డు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెంది న రచయిత జి.వి.శ్రీనివాస్‌కు గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్తంగా గిడుగు రామమూర్తి జాతీయ పురస్కారాన్ని అందజేశారు. గురువారం హైదారాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఈ అవార్డును ప్రదానం చేశారు. వివిధ రకాల కథలు, వ్యాసాలు ఉత్తరాంధ్ర, స్థానిక చరిత్రలపై పరిశోధనలు చేసినందుకు శ్రీనివాస్‌కు అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్నందుకు సాహితీవేత్తలు చీకటి దివాకర్, ఎం.కె.బాబు, మంజిరి, భోగారావు అభినందనలు తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

బొబ్బిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొంటున్నట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. క్యాడెట్ విభాగంలో జరిగే పోటీలకు పట్టణానికి చెందిన విద్యార్థులు ఎస్.జాజిలి, డి.ఆదిత్య, శివరామకృష్ణలు సిద్ధపడుతున్నట్లు ఆయన తెలిపారు. వీరిని స్థానిక ఎమ్మెల్యే, తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు బేబీనాయన గురువారం స్థానిక కోటలో అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి బొబ్బిలికి పేరు తీసుకురావాలని వారిని ప్రోత్సహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నట్లు కోచ్ ప్రసాద్ తెలిపారు.

దేవాలయ పునః నిర్మాణానికి విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ పునః నిర్మాణం కోసం గురువారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విరాళాలను సేకరించారు. తోటపల్లి దేవాలయాల అభివృద్ధి సేవా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలపై బాధ్యతగా ఉండాలి

సాలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల ప్రవర్తన, విద్య, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ జాతీయ కార్యదర్శి బ్రహ్మాజీరావు సూచించారు. మామిడిపల్లి సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కారం నేర్పించినప్పుడు ఉత్తమ సమాజం ఏర్పడడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మరిపిల్లి ఎంపీటీసీ సభ్యుడు జన్ని సీతారాం, క్రాలేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాలకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్టలి జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్వతీపురం మండలం బందలిపి గ్రామానికి చెందిన దిలీప్‌కు గాయాలయ్యాయి. అల్ట్రాటెక్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తన సొంత పని నిమిత్తం పాలకొండ వస్తుండగా ఆటోను తప్పించబోయి ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. 108 వాహనం సాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేపాడ ఎంఈవోగా నాగభూషణరావు

గరుగుబిల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంఈవోగా విధులు నిర్వహించి సస్పెండ్ అయిన ఎన్.నాగభూషణరావును విజయనగరం జిల్లా వేపాడ మండల ఎంఈవో-1గా నియమిస్తూ ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరాయని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వెలుగు ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై సంబంధిత వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా పరిపాలనా అధికారి డీవీ అప్పారావు మాట్లాడుతూ నిరక్షరాస్యులకు చదువు నేర్పించడానికి ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని తెలిపారు. వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

బొబ్బిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రహదా రి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం బొబ్బిలిలో ఎంవీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం